# భగ్గుమన్న నిప్పురవ్వ

- కందుకూరి వెంకట మహాలక్ష్మి

కన్యక పెళ్లి-

పెళ్లివారు తరలి వస్తున్నారు.

స్టేషన్ నుంచి బ్యాండుమేళంతో వస్తున్నారు.

కన్యక తల్లి, దగ్గర బంధువులు హారతి పళ్లెం, కాళ్లు కడగడానికి చెంబుతో నీళ్లు పట్టుకుని విడిది దగ్గర రెడీగా వున్నారు.

పెళ్లికొడుకు కారు దిగి నిలబడ్డాడు.

కన్యక తల్లి హారతిచ్చి, కాళ్లమీద నీళ్లు పోసి మగపెళ్లివారిని ఆహ్వానించింది. పెళ్లివారంతా విడిదిలోకి వెళ్తున్నారు.

అక్కడే నిలబడి ఎంతో ఆత్రుతతో ప్రాణ స్నేహితురాలికి కాబోయే భర్తను చూడాలని వచ్చి నిల్చున్న మానవి పెళ్లికొడుకుని చూడగానే ఒక్కసారి గుండె ఆగినంత పనై, మళ్లీ చూసి, ఒక్కడుగు వెనక్కి వేసింది. ఇంక ఒక్క క్షణం కూడా నిలబడలేకపోయింది. పెళ్లికొడుకు పేరు గుర్తుకు తెచ్చుకుంది. వెంటనే వెనక వైపు నుంచి పరుగు పరుగున తన గదికి వచ్చి తలుపు తాళం తీసింది. పెట్టె తెరిచి వెతికింది. పెట్టె అడుగున వున్న కవరు తెరిచి చూసింది. తన గుండె కొట్టుకోవడం తన చెవులకి వినపడుతోంది. వెంటనే కొంచెం మంచినీళ్లు తాగి మంచం మీద కూర్చుని ఆలోచించసాగింది. తలంతా బరువెక్కి పోతోంది. ఏం చెయ్యాలో తోచటం లేదు. ఆలోచనలు జోరీగల్లా బుర్రంతా ముసురుతున్నాయి. "ఇప్పుడు నిజాన్ని చెప్పేస్తే?! కన్యక ఎలా రియాక్టవుతుంది? చెప్పకపోతే ఆమె జీవితం కూడా నా జీవితంలా నాశనం అవుతుందేమో?!"

నేనూ, కన్యకా కలిసి వైజాగ్ హాస్టల్‌లో వుండి పి.జి. చేశాం. పి.జి. అయిపోగానే తండ్రి తనకి పెళ్లి చేశాడు. కన్యక కొన్నాళ్లు ఉద్యోగం చేస్తానంటూ ఉద్యోగంలో చేరింది. అప్పుడే ఉద్యోగంలో చేరడం వల్ల కన్యక నా పెళ్లికి రాలేకపోయింది.

పెళ్లయిన ఏడాదిపాటు జీవితం ఎంతో హాయిగా, హుందాగా గడిచింది. ఆ తరువాత భర్త, అత్తమామల ప్రవర్తనలో మార్పు రావడం ప్రారంభమయింది. తండ్రి లక్ష రూపాయల కట్నం యిచ్చి పెళ్లి చేశాడు. మొదటి పండక్కి స్కూటర్ కొని యిచ్చాడు. మానవి తరువాత యిద్దరు పిల్లలున్నా రామయ్యగారు తన శక్తికి మించి మొదటి పిల్ల పెళ్లి చేసి సారె, చీర పెట్టి ఆనందంగా అత్తవారింటికి పంపాడు. కానీ ఆశ తీరని భర్త ఫారిన్ వెళ్లాలనీ, దానికి మామగారిని డబ్బు పెట్టమని ప్రారంభించాడు. దానికి వంత పాడటం ప్రారంభించారు అత్తమామలు. అది విన్న మానవి తండ్రి కూతురితో "అమ్మా! ఈ ఏడాది తమ్ముడికి డొనేషన్ కట్టి ఏ కాలేజీలోనో చేర్పించాలి కదమ్మా! తరవాత చెల్లాయి పెళ్లి కూడా చెయ్యాలి. సంబంధాలు చూస్తున్నాం కదా. ఇప్పుడు అంత డబ్బు నా దగ్గర లేదమ్మా!" అని చెప్పగానే, అవే మాటలు భర్తతో చెప్పింది. ఆనాటి నుంచీ మానవిని సతాయించడం ప్రారంభించారు. దీంతో ఆగక పుట్టింటికి వెళ్లిపొమ్మని పంపేశారు.

పుట్టింటిలో ఆడపిల్లుండిపోతే తరవాత పిల్లకి పెళ్లవదేమో అన్న భయంతో తండ్రే స్వయంగా మానవిని తీసుకెళ్లి వియ్యాలవారి కాళ్లావేళ్లా పడి బ్రతిమాలి దింపి వచ్చాడు. ఇది అలుసుగా తీసుకుని మానవిని పెట్టిన బాధలు పెట్టకుండా హింసించసాగారు. తిట్టడం, కొట్టడంతో ఆపకుండా ఆఖరికి చంపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుసుకున్న మానవి ఓ రాత్రి ఇల్లొదిలి పారిపోయి, వేరే వూళ్లో వుంటున్న ఓ స్నేహితురాలింట్లో తలదాచుకుంది. ఆ స్నేహితురాలు మానవి కథంతా విని తన తండ్రి ద్వారా ఆమెకి ఓ కంపెనీలో ఉద్యోగం వేయించింది.

తండ్రి భరోసా లేని మానవి తండ్రికీ విషయం చెప్పినా లాభం లేదని తనో గది తీసుకుని తన బ్రతుకు తాను బ్రతకసాగింది.

మానవి ఎవడితోటో లేచిపోయిందని భర్త, అత్తమామలు పుకారు పుట్టించారు. అది తండ్రికి తెలిసి బాధపడ్డాడనీ తెలిసింది. తండ్రి తను ఎక్కడున్నదీ, ఎలాగున్నదీ కూడా పట్టించుకోకపోవడం మానవికి బాధ కలిగించింది. తనకెవ్వరూ లేరు అనుకుంటూ ఉద్యోగం చేసుకుంటూ తన బ్రతుకు తాను బ్రతకసాగింది మానవి.

కన్యక తల్లీ, తండ్రీ కూడా అదే వూళ్లో వుండడం, వేరే వూళ్లో ఉద్యోగం చేస్తున్న కన్యక తల్లిదండ్రుల దగ్గరికి వచ్చినప్పుడు యిద్దరూ కలుసుకుని సరదాగా కాలక్షేపం చెయ్యడం ఎంతో ఆనందంగా వుండేది మానవికి.

కన్యక ఈసారి వచ్చినప్పుడు తనకి పెళ్లి కుదిరిందనీ, పెళ్లనీ చెప్పినప్పుడు ఎంతో ఆనందించింది. పెళ్లి అదే వూళ్లో అవడంతో అంతా తనే అయి షాపింగ్ కయితేనేం, పనుల కయితేనేం కన్యకతో కలిసే తిరిగేది మానవి.

రేపు రాత్రి పెళ్లి, ఉదయం స్నాతకం. అందుకు ఈ రోజు సాయంకాలమే పెళ్లివారొచ్చేశారు.

ఇప్పుడేం చెయ్యాలి? పెళ్లి ఆపుచెయ్యాలా? అన్న ఆలోచనతో బుర్ర గిర్రున తిరగసాగింది. చివరికి ఏదో నిశ్చయానికొచ్చి, వెంటనే కవరు తీసుకుని కన్యక ఇంటికి బయలుదేరింది.

పెళ్లికూతురు ముస్తాబులో అందాల భరిణెలా వున్న కన్యకని చూస్తూనే రెండు నిముషాలు ఆగిపోయింది మానవి.

"ఏమిటి మానవీ? అలాగున్నావేమిటి? ఇంతదాకా ఎంతో హుషారుగా వున్నావు?!" అంటున్న కన్యకకి మానవి తన చేతిలో వున్న కవరు అందించింది.

"ఏమిటిది?" అంటూ ఆశ్చర్యంగా కవరు తెరిచి చూసింది కన్యక. ఆ కవరులో మానవీ, భర్తల ఫొటో, మానవి పెళ్లి శుభలేఖ- ఆ రెండూ చూసి షాక్ తగిలినట్లుగా ముఖం నల్లబడిపోయింది కన్యకకి.

ఇద్దరూ కొంతసేపు ఏమీ మాట్లాడలేకపోయారు. మౌనాన్ని భంగపరుస్తూ మానవి అంది- "నన్ను మోసగించి, మళ్లీ పెళ్లికొడుకయి నీ జీవితాన్ని కూడా నాశనం చేస్తున్నాడే కన్యకా! నీ జీవితాన్ని కాపాడవలసిన బాధ్యత నాపై వుంది. కనుక నీకీ విషయం చెప్తున్నా. ఆలోచించుకో. ఏం చేద్దామంటావు? ఈ విషయం తెలిస్తే మీ నాన్నగారేమంటారు?" అంటున్న మానవి వైపు చూస్తున్న కన్యక ముఖంలో ఆవేశం పొగలు గ్రక్కుతోంది. వళ్లంతా చెమటతో తడిసిపోయింది.

వెంటనే "నాతో రా!" అంటూ ఇద్దరూ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి, వ్రాతమూలకంగా కంప్లయింట్ యిచ్చి వచ్చారు.

జీపులో కన్యక ఇంటికి పోలీసులు వచ్చారు.

పెళ్లివారింటి ముందు పోలీసు జీపు ఆగడంతో పెళ్లివారింట్లో చుట్టాలు, ఇరుగుపొరుగు వారు ఒక్కసారిగా బైటకొచ్చారు. కన్యక తండ్రికి కారణం తెలీక కంగారు పడసాగాడు. కన్యక తండ్రికి విషయమంతా చెప్పి, ఆయన్ని తీసుకుని మగపెళ్లివారి విడిదికి వెళ్లారు. పోలీసుల్ని, కన్యక తండ్రిని చూసి కంగారుపడ్డ పెళ్లికొడుకు, తల్లీ, తండ్రీ వెర్రివాళ్లలా నిలబడిపోయి "ఏమయింది? ఈ పోలీసులు ఏమిటి?" అంటూ కంగారు పడసాగారు.

పోలీసులు మానవి పెళ్లి ఫొటో, శుభలేఖ చూపించగానే "ఈ అమ్మాయి మా అబ్బాయిని పెళ్లిచేసుకున్న కొన్నాళ్లకి మరెవడితోనో లేచిపోయింది. అందుకు మా అబ్బాయికి మళ్లీ పెళ్లి చేస్తున్నాం. అందులో మా తప్పేముంది?" అని బుకాయించబోయారు.

"ఆ విషయం మాతో ముందుగా ఎందుకు చెప్పలేదు?" అని కన్యక తండ్రి అడగ్గానే కంగారుపడ్డారు.

ఇంతలో మానవి తనకి ఉద్యోగం వేయించిన స్నేహితురాల్ని, తండ్రిని తీసుకువచ్చింది. వాళ్లు వచ్చి విషయమంతా చెప్పి, తామే మానవికి ఉద్యోగం వేయించామని, తమ ఇంటి దగ్గరే ఓ గదిలో వుంటోందని చెప్పగానే, ఇంక ఏమీ చెప్పలేక పిచ్చివాళ్లలా పోలీసుల దగ్గర, కన్యక తండ్రి దగ్గర కాళ్లబేరానికొచ్చి బ్రతిమాలుకోసాగారు.

కన్యక తండ్రి పోలీసులతో వాళ్లని అరెస్టు చెయ్యమని చెప్పి వెళ్లిపోతుండగా, పెళ్లికొడుకు తండ్రి "మానవిని తీసుకెళ్లి మళ్లీ ఏలుకుంటామనీ, ఆమెకు ఏ యిబ్బందీ కలుగజేయమనీ" బ్రతిమాలుకోసాగారు.

కన్యక తండ్రి మానవిని పిల్చి "అమ్మా మానవీ! వీళ్లు నిన్ను ఇంక బాగా చూసుకుంటామని వాళ్ల తప్పు ఒప్పుకుంటున్నారమ్మా. నీ అభిప్రాయం చెప్పు" అనగానే, మానవి కోపంతో చర్రున లేచి "అంకుల్... ఇదేమన్నా ఆటబొమ్మనుకున్నారా? వాళ్లిష్ట మొచ్చినప్పుడు ఏడిపించడం, తప్పు దొరికిపోగానే కాళ్లబేరానికి రావడమూనా? వాళ్లకి సిగ్గు లేకపోతే నాకుంది. అంకుల్! వాళ్లని అరెస్టు చేసి శిక్షించవలసిందే! తప్పు వాళ్లలో పెట్టుకుని, నేనేదో తప్పు పని చేసినట్లు వూరంతా పుకార్లు పుట్టించి, మళ్లీ పెళ్లికొడుకయిన అతనికీ, అతని తల్లిదండ్రులకీ తగిన శిక్ష పడవలసిందే! వాళ్లు నన్ను ఏలుకుంటానన్నా, నేనా యింటి గడప మళ్లీ తొక్కేది లేదు. ఇదే నా ఆఖరి నిర్ణయం" అంటూ లేచి నిలబడ్డ మానవి చేతులు పట్టుకుని బ్రతిమాలుతున్న పెళ్లికొడుకు చేతులు విదిల్చికొట్టి వెళ్లిపోయింది మానవి.



పోలీసులు పెళ్లికొడుకు చరణ్‌ని, తల్లిదండ్రుల్ని జీపెక్కించుకుని పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్తున్నప్పుడు కన్యక తండ్రి "అమ్మా మానవీ! నా కూతురి జీవితాన్ని నాశనం కాకుండా కాపాడావు తల్లీ! నీకెలా ధన్యవాదాలు చెప్పాలో తెలీటం లేదమ్మా" అని మానవిని పొగుడుతుండగా మానవి, "అంకుల్! నేనీ విషయం చెప్పడానికి ఎంతో భయపడ్డాను. మీరు మా నాన్నగారిలా కాకుండా కూతురి జీవితాన్ని చక్కదిద్దడానికి ప్రయత్నించారు. పైగా నాకు 'మేమంతా వున్నాం, నీకేం భయం లేద'ని హామీ ఇచ్చారు. కన్న తల్లిదండ్రులు కూడా ఆ మాట అనలేదు. అదే మీలో వున్న గొప్పతనం. నన్ను మొదటిసారి పుట్టింట్లో దింపేసినప్పుడు మా నాన్న- కూతురు ఇంట్లో వుంటే పరువు తక్కువని, అత్తారింట్లో దింపేసి వచ్చి మళ్లీ నా గురించి పట్టించుకోలేదు. పెళ్లి చెయ్యగానే తండ్రి బాధ్యత తీరిపోదు. కూతురు మంచిచెడ్డలు చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులకి వుంది. కూతురు కష్టాల్లో వున్నప్పుడు కనీసం 'నేను వున్నానని' మాట సహాయం వుండాలి. అది తల్లిదండ్రుల కనీస బాధ్యత. నా స్నేహితురాలే ఆ రోజు నన్ను ఆదుకుని వుండకపోతే నేనీ రోజెలాగుందునో నాకే తెలీదు అంకుల్!" అంటూ బాధపడుతున్న మానవిని అక్కున చేర్చుకున్న కన్యక తండ్రిని ఆరాధనగా చూసింది మానవి. ●